

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న సతీశ్‌రెడ్డి

## శివకల్యాణం వేడుకలకు ఎమ్మెల్యే పల్లాకు ఆహ్వానం

బచ్చన్నపేట, ఫిబ్రవరి 25 : మండలంలోని కొడవటూరులో జరుగుతున్న సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు, శివకల్యాణం వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరుతూ మంగళవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందించారు. ఈ మేరకు సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు పల్లాను కలిశారు. మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే శివకల్యాణం, అగ్నిగుండాలకు హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు షబ్బీర్, దూడల కనకయ్యగౌడ్, ఈదుల కంటి ప్రతాప్‌రెడ్డి, తిర్మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**దుర్గామాత ఉత్సవాలకు..**

చిన్నరామన్‌చర్లలో నిర్వహించే దుర్గామాత ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మాజీ సర్పంచ్ ఖలీల్‌ఆజాం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందించారు. బుధవారం నుంచి మార్చి 2 వరకు జరిగే దుర్గామాత ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, గ్రామ అధ్యక్షుడు దాసారి కరుణాకర్‌రెడ్డి, నాయకులు గుర్రాల నర్సిరెడ్డి, ఆజాం, పుర్మ జోగిరెడ్డి, వంగ మల్లారెడ్డి, దాసరి రాంరెడ్డి పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మండల నాయకులు

## తెలంగాణభవన్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

లింగాలఘనపురం, ఫిబ్రవరి 25 : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశానికి మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లాయి. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నేతృత్వంలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో అక్కడ జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సేవెల్లి సంపత్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఉడుగుల భాగ్యలక్ష్మి, కరుణాకర్, గట్టగల్ల శ్రీహరి , రామచందర్, దండిగ మహేశ్, బెజ్జం అశోక్, రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లికార్జున్

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 25 : వేసవి నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మల్లికార్జున్ సూచించారు. మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చామంతి అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి రోజూ మంచినీటి సరఫరా జరిగేలా పంచాయతీలు చూడాలన్నారు. పైపులైన్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్‌భగీరథ నీటిని నిత్యం అందించాలని, ఇందుకోసం వాటర్‌మెన్లకు ప్రత్యేక సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

jobs Apply Now!

★ లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565


### మహిళ ఆత్మహత్య



జయమ్మ(ఫైల్)

దేవరుప్పుల, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని కొత్తవాడకు చెందిన జోగు జయమ్మ(50) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తవాడకు చెందిన జయమ్మ కుమారుడు జోగు శ్రీకాంత్ కొంత కాలం క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పటి నుంచి మనోవేదనకు గురవుతున్న జయమ్మ మంగళవారం తెల్లవారు జామున పురుగుల మందు తాగింది. గమనించిన ఆమె భర్త మైసయ్య 108 వాహనంలో జయమ్మను జనగామ ఏరియా దవఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యానికి వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు పంపగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువు జోగు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఐనవోలు, ఫిబ్రవరి 25 : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 11 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై పస్తే శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పంథిని శివారులో సోమవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న 11 ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- అరకొర వసతులతో చిన్నారుల పాట్లు
- సొంత భవనాలు నిర్మించాలంటున్న అంగన్‌వాడీ టీచర్లు
- మొబైల్ యాప్‌తో అదనపు పనిభారం



జఫర్‌గఢ్‌లో అద్దె గదిలో అంగన్‌వాడీ కేంద్రం



తిమ్మాపూర్ పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రం

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 25 : మాతా, శిశు సంక్షేమమే ధ్యేయంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు కరువయ్యాయి. అనేక గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ఉద్దేశించిన ఈ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడం సమస్యగా మారింది. దీంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిశు సంక్షేమ పథకం(ఐసీడీఎస్) ప్రాజెక్ట్‌ను నియోజకవర్గ కేంద్రమైన స్టేషన్ ఘన్‌పూర్‌లో 2002లో ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జఫర్‌గఢ్ మండలంలోని 23 గ్రామాల్లో 62 అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో కేవలం ఐదింటికి మాత్రమే సొంత భవనాలుండగా, 39 కేంద్రాలను అద్దె భవనాల్లో, 18 కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. హిమ్మత్‌నగర్, జఫర్‌గఢ్, కూనూరు, షాపల్లి, సాగరంలోని వడ్డెరకాలనీలో సొంత భవనాలున్నాయి. సూరారం, వడ్డెగూడెం, తిమ్మాపూర్ గ్రామాల్లో చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. మిగతా కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా, వీటి నిర్వహణ ఇబ్బందిగా ఉందని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లో అటు పాఠశాల విద్యార్థులు, ఇటు అంగన్‌వాడీ చిన్నారులు ఒకే గదుల్లో ఉండడం సమస్యలా మారింది. దీంతో పాఠశాల విద్యార్థులు చదువుకోలేక పోతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**అరకొర వసతులతో చిన్నారుల పాట్లు..**

మండలంలోని పలు గ్రామాల్లో 39 అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇక్కడికి వచ్చే మూడు నుంచి ఆరేళ్ల వయసున్న చిన్నారులకు ఆట, పాటలతో కూడిన విద్యను అందించాల్సి ఉంటుంది. అయితే అద్దె భవనాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో చిన్నారులకు ప్రీ స్కూల్ నిర్వహించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. కేంద్రాలకు సొంత భవనాలుంటే చిన్నారులకు అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. బాలింతలు, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు అనువైన స్థలం లభిస్తుందంటున్నారు. తల్లుల కమిటీ సమావేశాలు సజావుగా నిర్వహించే వీలుంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాతా, శిశు సంక్షేమం కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని, తద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, కోరుతున్నారు. చిన్నారులు, బాలింతలు, తల్లులకు అందించే మెనూతోపాటు ఇతర వివరాల అప్‌డేట్ కోసం సర్కారు అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను, యాప్‌ను అందించింది. అయితే యాప్ సక్రమంగా డౌన్ లోడ్ కాకపోవడంతో అంగన్‌వాడీలకు పనిభారం పెరుగుతున్నదని పలువురు తెలిపారు. ఆయిల్, బియ్యం, పప్పు, పాలు, కోడిగుడ్ల మెనూను పెంచాలని, అంగన్‌వాడీ టీచర్లకు కొత్త సెల్‌ఫోన్లు అందించాలని కోరారు.



**నాణ్యత లేని రేషన్‌బియ్యం ఇస్తున్నరు..**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందించే బియ్యం నాణ్యతగా ఉండడం లేదు. రేషన్ బియ్యం ఇస్తున్నా బాగా లేకపోవడంతో చిన్నారులు అన్నం తినలేకపోతున్నారు. కేంద్రాలకు పంపిణీ చేసే బియ్యం బాగుండాలి. అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం కొత్త ఫోన్లు అందించి పని భారం తగ్గించాలి.

– మచ్చ శారద, అంగన్‌వాడీ టీచర్, హిమ్మత్‌నగర్



**అద్దె భవనాలతో చిన్నారులకు ఇబ్బందులు..**

అనేక గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. దీంతో చిన్నారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అద్దె ఇండ్లు కావడంతో ఇంటి యజమానులు ఎప్పుడు ఖాళీ చేయిస్తారో తెలియడం లేదు. అందుకే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను ప్రభుత్వం నిర్మిస్తే అందరికీ మేలు జరుగుతుంది.

– మౌనిక, అంగన్‌వాడీ టీచర్, ఉప్పుగల్లు

## పకడ్బందీగా టెన్త్ పరీక్షలు నిర్వహించాలి

**అధికారులతో సమీక్షలో కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా ఆదేశం**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 25 : పదో తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాల్లో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి ఎస్ఎస్‌సీ వార్షిక పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో 41 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 6238 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు 41 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 41 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. మూడు రూట్లలో ముగ్గురు రూట్ అధికారులను కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని కోరారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, టాయిలెట్స్, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష ప్యాడ్, పెన్ను, పెన్సిల్, రబ్బర్, ఒరిజినల్ హాల్ టికెట్‌తో మాత్రమే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని తెలిపారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసి వాటి పనితీరును పర్యవేక్షించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులు నడిపించాలని ఆదేశించారు. సందేహాలుంటే కంట్రోల్ రూమ్ నంబర్ 9000293231 లేదా 9989544981కు ఫోన్ చేయాలని విద్యార్థులకు సూచించారు.

### నిరంతర విద్యుత్‌కు అధికారులు కృషి చేయాలి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 25 : జిల్లాలో నిరంతర విద్యుత్ సరఫరాకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వెనకాల గల 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని గృహాలు, పరిశ్రమలు, వ్యవసాయానికి సరిపడా విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 78 విద్యుత్ సబ్ స్టేషన్లు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మరమ్మతులు వస్తే వెంటనే బాగు చేయించాలని సూచించారు. విద్యుత్ వినియోగానికి సంబంధించిన రికార్డులన్నింటినీ ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ కోరారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఆపరేషన్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, టెక్నికల్ డీఈ గణేశ్, ఏడీఈ వేణుగోపాల్, ఏఈ చంద్రమోహన్ పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

రఘునాథపల్లి, ఫిబ్రవరి 25: మండలంలోని వెల్ది మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖాళీగా సీట్ల భర్తీ కోసం వచ్చే నెల 10వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీధర్ కోరారు. అభ్యర్థులకు ఏప్రిల్ 13న అర్హత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 855 5825955 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## కుందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన



స్వయంపాలనలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

లింగాలఘనపురం, ఫిబ్రవరి 25 : మండలంలోని కుందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. పదో తరగతి విద్యార్థులు కే శ్రీకాంత్ హెచ్‌ఎంగా, ఎం రేణుక డీఈవోగా విధులు నిర్వర్తించారు. మరో 20 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు. అనంతరం జరిగిన సమావేశంలో హెచ్‌ఎం బిట్ల రవి శంకర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందిస్తాయన్నారు. చదువుతోపాటు ఇతరరంగాల్లో విద్యార్థులు రాణించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసాచార్యులు, వెంకటేశ్వర్లు ,కె రమాదేవి, శ్రీనివాసాచార్యులు, రాములు, ఎం సుధారాణి, ఎం రజని, సిద్ధార్థ పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సర్కారు చేయూత



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 25 : మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన 'మెప్మా' ఆధ్వర్యంలో లతశ్రీ మహిళా సంఘం సభ్యులు ఇందిరా మహిళా శక్తి పథకంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన, సాధికారత కొనసాగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం అమలుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఎంచుకున్న వ్యాపార రంగంలో మహిళలు రాణిస్తూ ఆదర్శకంగా నిలవాలని సూచించారు. క్యాంటీన్ ఏర్పాటుకు మొత్తం రూ.45 లక్షలు ఖర్చు కాగా, రూ.20 లక్షలు బ్యాంకు రుణం అందించినట్లు పేర్కొన్నారు. క్యాంటీన్‌కు వచ్చే వినియోగదారులకు నాణ్యమైన, రుచి, శుచి కలిగిన ఆహార పదార్థాలను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ హర్షవర్ధన్, డీఎంసీ రమేశ్, టీఎంసీ రాజేందర్ పాల్గొన్నారు.



ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

### యూరియా కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

పాలకుర్తి, ఫిబ్రవరి 25: ఫర్టిలైజర్ షాపు యజమానులు యూరియా కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ పొట్టబత్తుల శ్రీనివాస్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఏవో శరత్ చంద్రతో కలిసి ఆయన తనిఖీ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపు యజమానులు షాపులో తప్పనిసరిగా స్టాక్ బోర్డుతోపాటు ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ రాకేశ్ ఉన్నారు.

### మైక్‌సెట్ బహూకరణ

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 25 : మండలంలోని తమ్మడపల్లి(జీ)లోని దూడల మల్లన్న ఆలయానికి మాజీ సర్పంచ్ అన్నెపు పద్మాఅశోక్ దంపతులు మంగళవారం రూ.17 వేల విలువైన మైక్‌సెట్‌ను బహుకరించారు. గ్రామస్తుల సమక్షంలో ఆలయ నిర్వాహకులకు వారు అందించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని వీటిని అందించామని పద్మాఅశోక్ తెలిపారు. దీంతో మాజీ సర్పంచ్ దంపతులను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కొమురయ్య, రాజేందర్, సారయ్య, వంశీ పాల్గొన్నారు.

## మెట్టుగుట్టపై పొంచి ఉన్న ప్రమాదం

- రోడ్డు పక్కన కూలిపోయి ప్రమాదకంగా రెయిలింగ్
- భద్రత కల్పించని అధికారులు, పోలీసులు



కూలిపోయి ప్రమాదకరంగా ఉన్న రెయిలింగ్

మడికొండ, ఫిబ్రవరి 25 : మహాశివరాత్రిని పురస్కరించుకొని మడికొండ మెట్టుగుట్టపై అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ, గుట్టపైకి వెళ్లే రహదారి పక్కన ప్రమాదం పొంచి ఉన్నది. గుట్టపైకి వెళ్లే దారిలో మలుపు వద్ద రెయిలింగ్ కూలిపోయి ఏడాది కావొస్తున్నా సంబంధిత అధికారులు దాన్ని నిర్మించలేదు. సుమారు రెండు లక్షల మంది భక్తులు హాజరయ్యే మెట్టుగుట్టపై కనీసం ప్రమాదాన్ని సూచించే హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయలేదు. జాతర సమయంలో కూడా ఎలాంటి పట్టింపు లేకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతర ఏర్పాట్లను ఎండోమెంట్, మున్సిపల్ అధికారులతో పాటు డీసీపీ, ఏసీపీ స్థాయి ఉన్నతాధికారులు సైతం పరిశీలించారు. కానీ, ప్రమాదకరంగా ఉన్న రోడ్డు వద్ద భక్తుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు మాత్రం చేపట్టలేదు. జాతరలో ఎలాంటి ప్రమాదం జరుగక ముందే పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని భక్తులు కోరుతున్నారు.



పాలకుర్తిలో బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు

## మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పాలకుర్తి, ఫిబ్రవరి 25: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు పూజలు చేశారు. మరోవైపు ధ్వజారోహణం, గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, హోమంతో ఉత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, ఎస్సై దూలం పవన్‌కుమార్, ఆలయ అర్చకులు దేవగిరి లక్ష్మన్న శర్మ, డీవీఆర్ శర్మ, అనిల్ శర్మ, సునీల్ శర్మ, నాగరాజ శర్మ, శ్యాం, సంతోష్‌శర్మ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 25 : యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లాలో అక్రమంగా జరిగే మాదక ద్రవ్యాల విక్రయం, రవాణాపై పోలీసులకు డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు వారికి రూ.5 వేల నగదు బహుమతి ప్రోత్సాహకంగా అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాలల్లో యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం బ్యాగ్ డేను నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రమేశ్, ఏసీజీఈ రవి కుమార్, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రెటరీ రామరాజు పాల్గొన్నారు.




దేవరుప్పులలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

దేవరుప్పుల, ఫిబ్రవరి 25: వరంగల్,ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల స్థాయిలో ఒకే పోలింగ్ కేంద్రం ఉండగా కామారెడ్డిగూడెం ఉన్నత పాఠశాలలో పోలింగ్ స్టేషన్ నంబర్ 7ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు ఉన్నారని, బ్యాలెట్ పద్ధతిన పోలింగ్ జరుగుతుందన్నారు ఇక్కడి పోలింగ్ కేంద్రంలో 52 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 34 మంది పురుషులు, 18 మంది మహిళలు ఉన్నారని మహిపాల్‌రెడ్డి వివరించారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.

## రంజాన్ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 25 : రంజాన్ వేడుకలకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాల్లో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్‌తో కలిసి రంజాన్ పండుగ ఏర్పాట్లపై శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 2వ తేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల కోసం షామియానాలు, తాగునీరుతో ఆటు మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. రాత్రి 11.30 గంటల వరకు వస్త్ర, వ్యాపార దుకాణాలు నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం మజీద్‌ల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు వారి పరిధిలో ఉన్న మజీదుల్లో ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు గోపీరాం, వెంకన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




పదో తరగతి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సాధిక్

## భయం వీడి పట్టుదలతో పరీక్ష రాయాలి

జనగామ రూరల్, ఫిబ్రవరి 25 : వార్షిక పరీక్షలంటే భయపడకుండా పట్టుదలతో చదివి రాస్తే మంచి మార్కులు వస్తాయని సాధిక్ ఫౌండేషన్ చైర్మన్ సాధిక్ అలీ అన్నారు. మంగళవారం పెంబర్తిలోని మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిలబస్‌లో అర్థంకాని విషయాలపై ఉపాధ్యాయులతో మాట్లాడాలన్నారు. వారి సలహాలు స్వీకరించి పరీక్షలు రాస్తే మంచి మార్కులు వస్తాయన్నారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, స్టేషనరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు అంకూస్‌భీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న సఖీ సెంటర్ అడ్మిన్ హైమావతి

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

హనుమకొండ, ఫిబ్రవరి 25 : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ సఖీ సెంటర్ అడ్మిన్ హైమావతి అన్నారు. మంగళవారం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని సఖీ సెంటర్‌లో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి సఖీ ముఖ్య ఉద్దేశాలు, అందిస్తున్న సేవల గురించి వివరించారు. మహిళా శిశు సంక్షేమాభివృద్ధి శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సెంటర్ ద్వారా ఐదు రకాల సేవలతో పాటు, కౌన్సెలింగ్, వైద్య, పోలీసు సాయం, తాత్కాలిక వసతి, న్యాయ సాయం అందిస్తున్నట్లు తెలిపారు. గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు లాంటి వాటి నుండి రక్షణ పొందడానికి సఖీ సెంటర్ పనిచేస్తుందని చెప్పారు. సమస్య ఉన్నప్పుడు 181 మహిళా హెల్ప్ లైన్ నెంబర్ లేదా చైల్డ్ లైన్ నెంబర్ 1098కు కాల్ చేయాలని సూచించారు.